ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.6 • కనిష్ఠం 27.5



కామారెడ్డి
జిల్లా వార్తలు

5

మంగళవారం 13 మే 2025

రైతులు ఈ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

మద్నూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): రైతులు భవిష్యత్తులో పీఎం కిసాన్, బ్యాంకు రుణాలు, ప్రధానమంత్రి ఫసల్ బీమా లాంటి ప్రయోజనాలు పొందాలంటే కచ్చితంగా ఈ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాజు అన్నారు. సోమవారం ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్న 5 రోజుల్లో 11అంకెల యూనిక్ నెంబర్ వస్తుందని చెప్పారు. ఆధార్ లింక్ ఉన్న మొబైల్ తీసుకుని వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని కోరారు.





ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై దృష్టి!

focus

- రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
- 9,064 ఇళ్లకు ప్రతిపాదనలు సిద్ధం
- ఇప్పటికే మొదటి విడతలో 1,808 ఇళ్ల మంజూరు
- వివిధ దశలలో 487 ఇళ్ల నిర్మాణాలు
- ఇళ్ల నిర్మాణం కోసం రుణ సదుపాయం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వం
- పొదుపు సంఘాల నుంచి రూ.1లక్ష వరకు రుణం తీసుకునే అవకాశం

కామారెడ్డి, మే12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచేందుకు సర్కారు దృష్టిసారించింది. ఇందులో భాగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలంటూ ఆయా జిల్లాలకు ఆదేశాలు జారీచేసింది. నిర్మాణాలతోపాటు లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలంటూ తెలుపడంతో జిల్లా అధికారులు ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచడంతో పాటు లబ్ధిదారులను గుర్తించడంలో కసరత్తు చేస్తున్నారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్లతో పాటు రెండో విడత నిర్మాణాలను పూర్తి చేయాలనే ఉద్దేశంతో పని చేస్తున్నారు. ఇప్పటికే రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి ప్రతిపాదనను సంబంధిత శాఖ అధికారులు సిద్ధం చేశారు. ఇళ్ల నిర్మాణాల కోసం రాష్ట్ర ప్రభుత్వం రుణ సౌకర్యం సైతం కల్పిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి దశల వారిగా ప్రభుత్వం నిధులను విడుదల చేయనున్నందున మొదట నిర్మాణానికి డబ్బులు లేక పేదలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పేదలకు గ్రామీణ స్థాయిలో పొదుపు సంఘాల నుంచి కూడా రుణం పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.



జుక్కల్‌లో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లాలో 9,064 ఇళ్లకు ప్రతిపాదనలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల్లో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. రెండో విడుతలో 9,064 ఇళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. కామారెడ్డి నియోజకవర్గంలో 3,028, ఎల్లారెడ్డిలో 3,363, జుక్కల్‌లో 2,673 ఇళ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బాన్సువాడ నియోజకవర్గం లోను ఇళ్ల ప్రతిపాదనల కోసం సర్వే కొనసాగుతోంది. అయితే ప్రతిపాదించిన ఇళ్ల నిర్మాణాలకు ఇన్‌చార్జ్ మంత్రి నుంచి ఆమోదం లభించాల్సి ఉంది. ఇందులో ఇప్పటికే 200ల ఇళ్లకు జిల్లా కలెక్టర్ మంజూరు చేసినట్లు తెలిసింది. త్వరలోనే రెండో విడత ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేయడంతో పాటు నిర్మాణ పనులు సైతం ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి.

వివిధ దశల్లో మొదటి విడత ఇళ్ల నిర్మాణాలు

గత జనవరిలో జిల్లావ్యాప్తంగా మొదటి విడుతగా 2,396 మంది లబ్ధిదారులను ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎంపిక చేసిన విషయం తెలిసిందే. వాటిలో 1,808 మందికి ఇళ్ల మంజూరు చేశారు. ఇప్పటికే ఈ ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. 487 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలో ఉన్నాయి. ఇందులో 385 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా 102 ఇళ్ల నిర్మాణాలు బేస్మిట్ స్థాయిలో ఉన్నాయి. అయితే గతంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం గ్రామసభల్లో ఇళ్లు లేని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఇలా జిల్లావ్యాప్తంగా 2,45,541 ఇళ్ల కోసమై దరఖాస్తులు వచ్చాయి. ఇందిరమ్మ ఇళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గృహ నిర్మాణ శాఖకు నిర్మాణాల బాధ్యతను ప్రభుత్వం అప్పగించింది. జిల్లాలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ప్రభుత్వం మొదటి విడుత కింద మంజూరు చేసింది. రూ.5 లక్షలు ఇళ్ల నిర్మాణం కోసం విడుతల వారిగా ప్రభుత్వం మంజూరు చేయనుంది.

లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు

ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అయితే మొదటి విడుత కింద స్థలంఉండి ఇళ్లు లేనివారికి ప్రాధాన్యత ఇస్తూ ఇళ్లను మంజూరు (తరువాయి 8వ పేజీలో..)

నేడు పాలిసెట్ పరీక్ష

- జిల్లాకేంద్రంలో ఆరు పరీక్ష కేంద్రాలు
- ఉదయం 11 గంటల నుంచి 1.30 వరకు పరీక్ష
- హాజరుకానున్న 2900 మంది అభ్యర్థులు
- నిమిషం నిబంధన అమలు

కామారెడ్డిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పాసైన విద్యార్థులు రెగ్యులర్ ఇంటర్ మీడియట్ కోర్సులకు బదులుగా టెక్నికల్ కోర్సుల చేసేందుకు వీలుగా ప్రతీ ఏడాది ప్రభుత్వం పాలిసెట్ ఎంట్రెన్స్ పరీక్షను నిర్వహిస్తోంది. ఈ ఏడాది మార్చ్‌లో పాలిసెట్ నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం మంగళవారం పరీక్షను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసింది. అందులో భాగంగా కామారెడ్డి జిల్లాకేంద్రంలో ఆరు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో రెండు, ఎస్ఆర్‌కే కళాశాలలో 1, సాందీపని కళాశాలలో 2, శ్రీఆర్యభట్ట కళాశాలలో ఒక కేంద్రంలో పరీక్షను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ పరీక్షలో పాసై ర్యాంక్ వచ్చిన అభ్యర్థులు డిప్లొమా కోర్సులైన ఇంజనీరింగ్, నాన్‌ఇంజనీరింగ్ టెక్నాలజీ, అగ్రికల్చర్, అగ్రికల్చర్ ఇంజనీరింగ్ తదితర కోర్సులు చేసుకునే అవకాశం దక్కుతుంది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆరు కేంద్రాలలో పరీక్షలు

పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు వీలుగా ఉండేట్లు జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్‌కు దగ్గర సమీప దూరంలోనే కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 2,900మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రం ఏలో 600 మంది, కేంద్రం బీలో 600మంది, ఎస్ఆర్‌కే డిగ్రీకళాశాల కేంద్రంలో 300 మంది, సాందీపని డిగ్రీ కళాశాల కేంద్రం ఏలో 500 మంది, కేంద్రం బీలో 400 మంది, శ్రీఆర్యభట్ట జూనియర్ కళాశాల కేంద్రంలో 500 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారు.

నిమిషం నిబంధన అమలు

పాలిసెట్ ప్రవేశపరీక్షను మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 1.30 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఉదయం 10గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని తెలిపారు. 11 గంటల తర్వాత ఒక్కనిమిషం ఆలస్యమైన లోనికి అనుమతి ఉండదని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమవెంట ఎస్‌బీపెన్సిల్, బ్లాక్ ఆర్ బ్లూ పాయింట్‌పెన్, హాల్‌టికెట్ తీసుకుని రావాలని సూచించారు. పరీక్ష కేంద్రంలోని వాచ్‌లు, మొబైల్‌ఫోన్‌లు, పర్సులు, ఎలక్ట్రానిక్ పరీక్షలు అనుమతించమని తెలిపారు. హాల్ టికెట్‌పై ఫొటో స్పష్టంగా లేకపోతే గెజిటెడ్ అధికారి ద్వారా తమ ఫొటోను ధృవీకరణ చేయించుకుని రావాలని తెలిపారు.



కమనీయం.. లక్ష్మీనర్సింహా స్వామి కల్యాణం

7

15 ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోరా?

- అభివృద్ధికి నోచుకోని ఇందిరమ్మ కాలనీలు
- కనిపించని డ్రైనేజీలు, సీసీ రోడ్లు



ప్రజలనుంచి దరఖాస్తులు తీసుకుంటున్న కలెక్టర్

ప్రజావాణి ఫిర్యాదులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డి టౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 76 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూముల సమస్యలు, రెండు పడక గదుల ఇళ్ల మంజూరు, రైతుభరోసా, పింఛన్ల మంజూరు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయని వివరించారు. దరఖాస్తులను పరిశీలించి సాధ్యాసాధ్యాల మేరకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై చర్యలు చేపట్టి దరఖాస్తుదారునికి సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో చందర్ నాయక్, ఆర్‌డీఓ వీణ, అధికారులు పాల్గొన్నారు.



దివ్యాంగుడి సమస్యను వింటున్న కలెక్టర్

పచ్చి రొట్ట.. పంటకు రక్ష

- రసాయనాల వాడకం తగ్గించేందుకు ప్రత్యామ్నాయం
- రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు

7

వడదెబ్బతో ఉపాధి కూలికి అస్వస్థత

లింగంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని నల్లమడుగు పెద్దతండాకు చెందిన ఉపాధి కూలీ తీవ్ర అస్వస్థతకు గురైనట్లు తండా మాజీ సర్పంచ్ రవీందర్ నాయక్ తెలిపారు. తండాకు చెందిన గొగులోత్ మోతీలాల్ సోమవారం ఉదయం తండా శివారులోని రఘుపతి కుంటలో ఉపాధి పనులకు వెళ్లినట్లు తెలిపారు. పనులు చేస్తుండగా వడదెబ్బతో అస్వస్థతకు గురై కిందపడడంతో వెంటనే కూలీలు మోతిలాల్‌ను చికిత్స నిమిత్తం కామారెడ్డిలోని తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సలహా మేరకు హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెల్లడించారు. పరిస్థితి విషమంగా ఉందని తండా వాసులు తెలిపారు.



ఆలయంలో వాటర్ ప్లాంటును ప్రారంభిస్తున్న షబ్బీర్‌అలీ


ఆలయ అభివృద్ధికి కృషి

- ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ

మాచారెడ్డి, మే12 (ఆంధ్రజ్యోతి): చుక్కాపూర్ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం ఎంతో మహిమ కలిగినదని, ఆలయ అభివృద్ధికి నావంతుగా శాయశక్తుల కృషిచేస్తానని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఆయన వేసవి కాలంలో భక్తుల దాహార్తి తీర్చడానికి ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంటును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ముస్లిం అయిన తనతో ఆలయ అభివృద్ధి చేసే భాగ్యం స్వామివారు కల్పించారని, ఆలయానికి రోడ్డు, కరెంట్ ఏర్పాటుచేసే అవకాశం కల్పించాడని అన్నారు. ఆలయం ప్రతీరోజు ముఖ్యంగా ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోతుందన్నారు. వేసవికాలంలో భక్తులకు ఈ వాటర్ ప్లాంటు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ కమలాకర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, గూడెం శ్రీనివాస్‌రెడ్డి, నౌసి నాయక్, సుతారి రమేష్, పండ్ల రాజు, ఐరేని సందీప్, ఏఎంసీ చైర్మన్లు లక్ష్మీరాజుగౌడ్, పాతరాజు, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్, దేవ రాజు గౌడ్, ఆశోక్‌రెడ్డి, ఆలయ డైరెక్టర్లు ఉన్నారు.



అర్ధరాత్రి మొరం తవ్వకాలు చేపడుతున్న దృశ్యం



మితిమీరుతున్న మొరం మాఫియా ఆగడాలు!

- అర్ధరాత్రి మొదలు తెల్లవారుజాము వరకు గుట్టల తవ్వకాలు
- అక్రమ మొరం మాఫియాకు రెవెన్యూ పోలీసు అధికారుల వత్తాసు
- ఫిర్యాదులు చేసినా పట్టింపు కరువు
- ఎన్నిసార్లు దాడులు జరిగినా మారని మాఫియా
- మొరం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడేనా!?

బాన్సువాడ, మే12 (ఆంధ్రజ్యోతి): రాత్రి పడితే చాలు మొరం మాఫియా ఆగడాలు మితిమీరుతున్నాయి. రాత్రికి రాత్రి గుట్టలను మాయం చేస్తున్నారు. బాన్సువాడ పట్టణ శివారులతో పాటు చెరువులు గుట్టలను తవ్వేస్తూ మొరం దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. సెలవు దినాలతోపాటు రాత్రి వేళల్లోనూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మొరం తరలిస్తూ లక్షలాది రూపాయలను ఆర్జిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. బాన్సువాడ డివిజన్ పరిధిలోని జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, పిట్లం, పెద్దకొడప్‌గల్, నిజాంసాగర్, బీర్కూర్, నర్సుల్లాబాద్, నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి, బాన్సువాడ మండలాల్లో మొరం, మట్టి అక్రమ తరలింపు జోరుగా సాగుతోంది. బాన్సువాడ మండలం సోమేశ్వర్ వాసుదేవిపల్లి శివారు జనిగేలా కుంటాలో, బీర్కూరు మండలం రైతు నగర్, అన్నారం, చించోలి, దామరంచ గ్రామ శివారులో ఎలాంటి అనుమతి లేకుండా మొరం తవ్వకాలు సాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. అక్రమార్కులు రాత్రిపూట తవ్వకాలు జరిపి గుట్టలను, చెరువులను మాయం చేస్తున్నారు. మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా అధికార పార్టీకి చెందిన నాయకుల పేరు చెప్పి తవ్వకాలు చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అనుమతులు లేకుండా సాగుతున్న మొరం వ్యాపారంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. మొరం వ్యాపారం చేయాలంటే మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇవ్వాలనే నిబంధన ఉంది. కానీ బాన్సువాడ డివిజన్‌లో నిబంధనలను తుంగలో తొక్కి దర్జాగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి అక్రమ మొరం, మట్టి రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ క్షేత్రస్థాయిలో రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖ అధికారులు మామూలు తీసుకొని అక్రమార్కులకు అండదండలు అందిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనుల పేరిట అధికారులకు తెలుపుతూ ప్రైవేట్ వ్యక్తులు చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలు, వెంచర్లు ఇతర త్రా నిర్మాణాలకు రాత్రి సమయాల్లో మట్టి, మొరం విక్రయాలతో వ్యాపారం సాగిస్తున్నారు. మట్టి, (తరువాయి 8వ పేజీలో..)

అర్హులైన వారికే ప్రభుత్వ సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు

ఆర్మూర్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస్ సంక్షేమ పథకాలను అమలు చేయాలని నందిపేట మండల కాంగ్రెస్ నాయకుడు మంద మహిపాల్ అన్నారు. సోమవారం నందిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు, అర్హులైన వారికి ఇందిరమ్మ కమిటీ సభ్యులు జాబితా తయారు చేసి మండల అధికారులకు అందజేయాలన్నారు. ప్రభుత్వం అందించే ప్రతీ పథకం అర్హులకు అందేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దమ్మాయి శీను, జమీల్, కమ్మాల గంగాధర్, ఎర్రం లింగం, ప్రభుదాస్, కాంతం చిన్నయ్య, మాన్పూర్ భూమేష్, పోశెట్టి, సాగర్, నర్సయ్య, నిఖిల్, ఫిరోజ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మెండోర, మే 12(ఆంధ్రజ్యోతి): మండలంలో సావెల్ గ్రామ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొని కశవత్రి గంగాధర్(46) మృతి చెందినట్లు ఎస్సై యాసిర్ అర్ఫత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఏర్గట్ల మండలం దోంచంద గ్రామానికి చెందిన గంగాధర్ సావెల్ గ్రామంలో బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వచ్చి తిరిగి వెళ్లే క్రమంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో వెంటనే మరో వాహనంలో ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. మృతుడు వారం రోజుల క్రితం గల్ఫ్‌దేశం నుంచి వచ్చాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. శుభకార్యానికి వచ్చి సమీపబంధువు మృతిచెందడంతో సావెల్ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

సుద్దులంలో గడ్డివాము దగ్ధం

కోటగిరి,మే12(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండలం సుద్దులం గ్రామంలో ఆదివారం రాత్రి తోట శివకుమార్ అనే రైతుకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పు అంటించడంతో సుమారు 500గడ్డి మోపులు కాలిపోయాయి. మంటలు పక్కనే ఉన్న పశువుల పాక వరకు వ్యాపించడంతో గమనించిన స్థానికులు స్పందించి గేదెలను వదిలివేశారు. దీంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పి వేశారు.

మూఢ విశ్వాసాలను విశ్వసించొద్దు

కోటగిరి,మే12(ఆంధ్రజ్యోతి):మూఢ విశ్వాసాలను విశ్వసించొద్దని రుద్రూరు ఎస్సై సాయన్న సూచించారు.రుద్రూరు మండలంలోని రాయకూర్ గ్రామంలో సోమవారం సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు పోలీసు కళాబృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.రోడ్డు భద్రతపై అవగాహన, మహిళల రక్షణ కోసం అత్యవసర పరిస్థితుల్లో సేవల నిమిత్తం గ్రామ భద్రత,ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు నాటికలు,పాటల రూపంలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

రెంజల్,మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో ఆదివారం రాత్రి ఎస్సై చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. సాటాపూర్ గ్రామానికి చెందిన సద్దాంకు మూడు రోజుల జైలుశిక్ష, లంగ్డాపూర్ గ్రామానికి చెందిన దండం లింగంకు రెండు రోజుల జైలుశిక్ష, బెల్‌గావ్ గ్రామానికి చెందిన షేక్.రెహమన్, తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన నవీన్‌కు ఒకరోజు జైలుశిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ న్యాయాధికారి శేషతల్ప సాయి తీర్పు వెల్లడించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. మండలంలో ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టప్రకారం శిక్షకు అర్హులన్నారు.

వ్యవసాయానికి అనుబంధంగా జీవాల పెంపకం చేపట్టాలి

● జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రోహిత్‌రెడ్డి



మాట్లాడుతున్న వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి

బాల్కొండ, మే 12(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయానికి అనుబంధంగా జీవాల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందాలని జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎం. రోహిత్‌రెడ్డి అన్నారు. బాల్కొండ మండలం వన్నెల్ బి లో సోమవారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జీవాల పెంపకానికి కోటి రూపాలయ వరకు రుణాన్ని అందజేస్తుందని ఇందులో 50 శాతం సబ్సిడీ కల్పిస్తుందాన్నరు. దేశీకోళ్ల పెంపకం, గొర్రెలు, మేకలు ఆవుల పంపకాన్ని పరిశ్రమగా మలుచుకోవాలన్నారు. వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ ముత్యంరెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ శస్త్రవేత్తల సలహాలు, సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త క్రిష్ణచైతన్య మాట్లాడుతూ పంటల సాగులో యూరియా రసాయనిక మందులను మోతాదుమేరకే వాడి సాగు ఖర్చు తగ్గించుకోవాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రశీదులను తప్పనిసరిగా భద్రపర్చుకోవాలని రైతులకు సూచించారు. పంటమార్పిడి విదానం ద్వారా అధిక దిగుబడులతో పాటు ఆదాయం కూడా లభిస్తుందన్నారు. సాగునీటిని ఆదా చేయడానికి ప్రతీరైతు కృషి చేయాలని కోరారు. అదేవిదంగా వ్యవసాయ క్షేత్రాలలో చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, ఏవో లావణ్య, హెచ్‌వో వినాయక్, డాక్టర్ ప్రభాకర్, ఏఈవోలు నిహారిక, రేష్మ, ఏఎంసీ డైరెక్టర్, రైతులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ది దోపిడీ పాలన.. మాది ప్రజాపాలన

● బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న ముత్యాల సునీల్‌కుమార్

మోర్తాడ్,మే 12(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలన దోపిడీ అవినీతి పాలన కాగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డిది ప్రజాపాలన అని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు.మోర్తాడ్‌లోని ప్రజానిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సునీల్‌కుమార్ మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలో టీఆర్‌ఎస్ హాయాంలో అవినీతి, దోపిడి తాండవించిందని నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పాలనలో కమిషన్లు అవినీతి ప్రజలకు తెలుసని సునీల్‌కుమార్ అన్నారు.ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఏమిపాలుపోక కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని పచ్చకామెర్ల వ్యక్తికి అంత పచ్చగా కన్పించినట్లు అవినీతి పరుడైన ప్రశాంత్‌రెడ్డి అంత అవినీతే కన్పిస్తుందని సునీల్‌కుమార్ ఎద్దెవా చేశారు.ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ప్రభుత్వ జీవో ప్రకారమే జరుగుతుందని అన్నారు. గతంలో డబుల్ బెడ్ ఇండ్లను రూ.50 వేల నుంచి లక్ష రూపాయల వరకు అమ్ముకున్నారని సునీల్‌కుమార్ ఆరోపించారు. ప్రజాపాలనలో పారదర్శకంగా అర్హులైన వారిని అధికారులు ఎంపిక చేస్తారని అన్నారు. సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మీ లబ్ధిదారుల నుండి కూడా డబ్బులు వసూలు చేసిన చరిత్ర బీఆర్‌ఎస్ దే అన్నారు. పోలీస్ స్టేషన్‌లో, రెవెన్యూ కార్యాలయాలు, పార్టీ కార్యాలయాలుగా చేసిన ఘనత ప్రశాంత్‌రెడ్డిదేనని అన్నారు. వరికొనుగోలు కేంద్రాలు సజావుగా నడుస్తున్నాయని ప్రభుత్వం మహిళ సంఘాలకు ఇవ్వడం వల్ల నిజాయితీగా పనులు జరుగుతున్నాయని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో వరికొనుగోలు కేంద్రాలలో 4 నుంచి 5 కిలోల కడ్త రైతుల నుంచి వసూలు చేసి ఎమ్మెల్యేలు పంచుకున్నారని సునీల్‌కుమార్ ఆరోపించారు. ప్రజా పాలనలో అన్ని సంక్షేమ పథకాలు అధికారుల సమన్వయంతో నిజమైన లబ్ధిదారులకు అందుతున్నాయని అన్నారు.ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దోపిడి అవినీతి ఎక్కడ బయటపడుతుందోనని కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. సమావేశంలో డీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు పాలెపు నర్సయ్య, ముత్యాల రాములు, పాలెపు నర్సయ్య, సోద దేవారెడ్డి, మహిపాల్, తీగెల సంతోష్, గురువయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ

ఎడపల్లి, మే12(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండలంలోని జానకంపేట గ్రామంలో ఆదివారం రాత్రి నిద్రిస్తున్న మహిళ మెడలో నుండి పుస్తెల తాడును గుర్తు తెలియని దొంగలు ఎత్తు కెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. వివారల్లోకి వెళితే గ్రామానికి చెందిన మంగళి రవి కుటుంబ సభ్యులు వేసవి కాలం దృష్ట్యా ఇంటికి తాళం వేసి ఆరు బయట పడుకున్నారు. వారు గాఢ నిద్రలో ఉన్న సమయంలో మంగళి రవి భార్య మెడలోని రెండు తులాల బంగారు గొలుసును కత్తిరించుకుని పారిపోతున్న సమయంలో బాధితురాలు, కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో దొంగ పారి పోయాడని మంగళి రవి తెలిపారు. అనంతరం బాధితుడు సోమవారం ఉదయం ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.

తెలుగుదేశం పార్టీ మండల కమిటీల నియామకం



ప్రమాణ స్వీకారం చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,మే12(ఆంధ్రజ్యోతి): బోధన్‌లో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గంలోని బోధన్ పట్టణంతో పాటు మండలం, సాలూర, రెంజల్ మండలాల కమిటీలను నూతనంగా నియమించడం జరిగిందని అడహక్ కమిటీ సభ్యులు కోట గోపాల్ రెడ్డి, పావులూరి వెంకటేశ్వర్ రావు, సీహెచ్ వీ హన్మంత్ రావు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ పార్టీ పునర్ నిర్మాణ చర్యల్లో భాగంగా సామాజిక, సమానత్వాన్ని చురుకైన కార్యకలాపాలను ప్రోత్సహించేలా పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేయడం యువతకు నాయకత్వ అవకాశాలు కల్పించడం, పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ కమిటీలు నియామకం చేపట్టడం జరిగిందన్నారు. అనంతరం నూతన కమిటీలచే ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గ సీనియర్ నాయకులు అమర్‌నాథ్ బాబు తిరిగి టీడీపీలో చేరడం జరిగిందని పేర్కొన్నారు. బోధన్ మండల అధ్యక్షులుగా బదూరి కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా యార్లగడ్డ ఈశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శిగా రాచగల్లా హన్మంత్ రావు, పట్టణ అధ్యక్షులుగా ముప్పాల గంగాదర్ రావు, ఉపాధ్యక్షులు సూరబత్తుని శ్రీనివాస్ రావు, దంతం వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా సుబ్బారావు, సాలూర మండల అధ్యక్షుడిగా కర్నాటి రామకృష్ణ, ఉపాధ్యక్షుడిగా బొల్లెపల్లి శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిగా చీల ప్రకాష్, రెంజల్ మండల అధ్యక్షుడిగా కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి యుసుఫ్ బేగ్‌లతో పాటు కార్యనిర్వాహణ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారులను నియమించడం జరిగిందన్నారు. పార్టీ అభివృద్ధి కోసం అందరు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కృష్ణా రెడ్డి, సచిన్ పటేల్, హన్మంత్ రావు, బాల గంగాధర్ రావు, రామకృష్ణ, సూరబత్తుని శ్రీనివాస్ రావు, గోవింద్ రావు, యుసుఫ్ బేగ్, విఠల్ పటేల్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను సర్వే చేసిన కలెక్టర్



వర్నిలో సర్వేచేస్తున్న సబ్‌కలెక్టర్

వర్ని,మే12(ఆంధ్రజ్యోతి): వర్ని మండలంలోని పొట్టిగుట్ట తండాను సోమవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో సందర్శించారు. లబ్దిదారులతో మాట్లాడి సర్వే నిర్వహించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మారుతి, కార్యదర్శి మస్తాక్ హుస్సేన్ పాల్గొన్నారు.

● సర్వేను పరిశీలించిన సబ్‌కలెక్టర్

కోటగిరి:పొతంగల్ మండలంలోని జల్లాపల్లి, కల్లూర్ గ్రామాలలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. సర్వేను పకడ్బందిగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన వారికే కేటాయించాలని,ప్రభుత్వ నిబంధనల మేరకు లబ్దిదారుల ఎంపిక చేపట్టాలని సూచించారు.అనర్హులకు కేటాయిస్తేచర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీవో చందర్, ఎంఈవో శంకర్, వ్యవసాయ అధికారి నిశిత,పంచాయతీ కార్యదర్శులు రాజలింగం,ప్రతాప్ తదితరులున్నారు.

వేల్పూర్‌లో మదర్సా పాఠశాలపై అధికారులకు ఫిర్యాదు



ఆర్ఐకి వినతిపత్రం అందజేస్తున్న హిందూ యువజన సంఘాల నాయకులు

వేల్పూర్, మే 12(ఆంధ్రజ్యోతి): వేల్పూర్‌లో ఉన్న మదర్సా పాఠశాలపై సోమవారం స్థానిక హిందూ యువజన సంఘాల నాయకులు తహసీల్దార్ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మదర్సా స్కూల్ ఎలాంటి పర్మిషన్‌లు లేకుండా నడుపుతున్నారని ఈ విషయంలో ఎంఈవో, డీఈవోలు పర్మిషన్ ఇచ్చినట్లయితే దానికి సంబంధించిన పత్రాలను తమకు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం కింద మెమోరాండం అందజేశారు. దేశవ్యాప్తంగా మదర్సా స్కూల్‌లను తీసివే స్తున్నారని అదే విధంగా వేల్పూర్‌లో ఉన్న మదర్సా స్కూల్‌ను కూడా తీసివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భజరంగ్‌దళ్ యూత్ అధ్యక్షుడు సుధాకర్, కమలేష్, యువజన సంఘాల నాయకులు నర్సారెడ్డి, అన్వేష్, శ్రీకాంత్, సృజన్ పాల్గొన్నారు.

పడిగెలలో గంగమ్మ కల్యాణ మహోత్సవం

వేల్పూర్,మే12(ఆంధ్రజ్యోతి):మండలం పడిగెలలో గంగపుత్ర సం ఘం ఆధ్వర్యంలో సోమవారం గంగమ్మ ఆలయంలో గంగమ్మ కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు గంగపుత్రులు వల గొడుగుతో మంగళ హారతులతో శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో ఉదయం అభిషేకం,అర్చణ,పున్యవచనం,హోమం అట్టి కార్యక్రమాలను నిర్వహించారు.ఈకార్యక్రమంలో గంగపుత్ర సంఘం సభ్యులుపాల్గొన్నారు.

బంజారా నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

ఆర్మూర్‌టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బంజారా నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. భారత్, పాకిస్తాన్ మధ్య జరుగుతున్న యుద్ధంలో మురళినాయక్ వీర మరణం పొందాడని దేశానికి స్వరాజ్యం రాకముందునుంచి మురళి నాయక్ కొరకు దేశం ధర్మం కోసం బంజారుల పాత్ర కీలకమైనదని వెనుకడుగు వేయడం తెలియనివారమని అన్నారు. మురళీ నాయక్ కు టుంబానికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆయన ఆత్మకు శాంతి కలు గాలని ప్రార్థిస్తు ఘనంగా నివాలులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గార్డెన్ రాజునాయక్, కేలోత్ పిర్సింగ్ నాయక్, బి. శీనునాయక్, కే. గంగాధర్, గజల్‌లాల్,బాల్‌రాం, సంతోష్, గంగాధర్, విఠల్, మోహన్, గణేష్, రవీందర్, బాలాజీ, గోనియా తదితరులు పాల్గొన్నారు.

'నేను సైతం దేశం కోసం'

ఆర్మూర్‌టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లోని నాగలింగేశ్వర ఆలయంలో నేనుసైతం దేశంకోసం అంటూ ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. దేశంకోసం విధులు నిర్వహిస్తున్న సైనికులకు, రక్షణశాఖ అధికారులకు, ప్రధాన మోదీకి మరింత శక్తిని ఇవ్వాలని ఉగ్రవాదాన్ని అనిచివేయడానికి భారత సైనికులు విజ యం సాధించాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కలిగోట గంగాధర్, ఆలయ కమిటీ ప్రతినిధులు అంబిక రమేష్, రాజయ్య, అజయ్, నారాయణ, సంఘ సభ్యులు సడాక్ మోహన్, సడాక్ గంగాధర్, పుప్పల రాజేందర్, కుకునూర్ లింగన్న, పొడలేని బాజన్న, తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా సమ్మెను విజయవంతం చేయాలి

భీమ్‌గల్, మే 12(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెలో ప్రతీ కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు పిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం భీమ్‌గల్ మున్సిపల్ కార్యాలయంలో కార్మికులతో సమావేశం నిర్వహించి గోడప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ పోరాడి సా ధించుకున్న హక్కులను కాలరాయటంతో పాటు ప్రజలపైన భారాలు మోసే పద్ధతుల్లో ధరలను విపరీతంగా పెంచి అన్ని వర్గాల ప్రజలపైన ఆర్థిక భారాలు మోపుతున్నారని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ కార్పోరేట్ కంపెనీలకు కట్టబెడుతున్నారని కార్మిక వర్గం ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న 29 చట్టాలను మార్చి నాలుగు కోడ్‌లు విభజించారని వీటి మూలంగా కార్మికులు హక్కులు వదించబడుతాయని తమ హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపు నివ్వడం జరిగిందన్నారు. సమ్మెలో ప్రతీఒక్క కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ గంగాధర్‌కు సమ్మె నోటీసును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, సీఐటీయు మండల అధ్యక్షుడు ఓంకార్, కార్యదర్శి నవీన్, సాయవ్వ, పోశయ్య, రాజు, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : రుద్రూరు మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సమ్మె వాల్ పోస్టర్లను సీఐటీయూ నాయకులు నన్నేసాబ్ ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి కార్మిక చట్టాలను బలోపేతం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20వ తేదిన తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకురాలు గంగామణి, ఆశా యూనియన్ నాయకులు భూలక్ష్మి, వాణి, లత, పుష్ప తదితరులున్నారు.

బీజేపీ కమ్మర్‌పల్లి మండల కార్యవర్గం

కమ్మర్‌పల్లి, మే 12: (ఆంధ్రజ్యోతి) మండల భారతీయజనతాపార్టీ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లికార్జున్ రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు దినేష్ కులచారి ప్రకటించినట్లు కమ్మర్‌పల్లి మండల పార్టీ అధ్యక్షుడు బద్దం రమేష్ రెడ్డి తెలిపారు. ప్రధాన కార్యదర్శులుగా సోమ నరేష్ (ఉప్లూర్) సున్నవడ్ల తిరుపతి (కమ్మర్‌పల్లి), ఉపాధ్యక్షులుగా సతీష్ (హాసాకొత్తూర్), ఎలాల వెంకట్ రెడ్డి (చౌట్‌పల్లి), వర్ష సంజన రాజేష్ (అమీర్‌నగర్), లక్ష్మీ గంగాధర్ (నర్సాపూర్) కార్యదర్శులుగా ఆల్గోట్ బలరాం (కమ్మర్‌పల్లి), ప్రశాంత్ (కోనాసముందర్).రవి (ఇనాయత్‌నగర్), భాస్కర్ (కోనాపూర్) కార్యవర్గ సభ్యులుగా మద్దం స్వప్న, ఊట్నూర్ శివకుమార్, పసుపుల చంద్రమోహన్, శ్రీరాముల శ్రావన్, సంతోష్, సక్కురం నర్సయ్య, వంశి, లక్ష్మరాజేస్, గణేష్, బానోత్ ప్రశాంత్ ఎన్నికయ్యారు.

గణేష్ ఆలయ 12వ వార్షికోత్సవం

ఎడపల్లి, మే12(ఆంధ్రజ్యోతి): ఎడపల్లి మండలంలోని పెద్ద చెరువు కట్టమీద స్వయంభుగా వెలసిన గణేష్ మందిర 12వ వార్షికోత్సవ వేడుకలను గ్రామస్థులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు తదితరులు ఉన్నారు.

గౌతమ బుద్ధుని జయంతి

ఆర్మూర్ రూరల్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ధ సిద్దుల గుట్టపై నిర్మించిన శ్రీనవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మందిరంలో సోమవారం బుద్ధ పౌర్ణిమ సందర్భంగా గౌతమిబుద్ధుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైనా ధ్యానులు అఖండ ధ్యానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లా డుతూ ప్రతీ ఒక్కరు గౌతమ బుద్ధుడు చెప్పిన మార్గంలో నడవాలని, సమాజా నికి గౌతమబుద్ధుడు ఆదర్శప్రాయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎస్ఎన్ జిల్లా అధ్యక్షుడు సాయిక్రిష్ణారెడ్డి, గొడ్డు దయానంద్, సాయినాథ్, సుదర్శన్, భూమన్న, మైలారం రాజు, ప్రశాంత్‌రెడ్డి, ధ్యానులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని తిమ్మాపూర్‌లో మోక్షనంద బుద్ధవిహార్‌లో 2569వ బుద్ధపౌర్ణమి వేడుకలు ఘనంగా సోమవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో బుద్ధుడి విగ్రహానికి పుష్పాంజలి, ధ్యానం, పతాక ఆవిష్కరణ జరిగింది. కార్యక్రమంలో ప్రజలనుద్దేశించి బంతి దమ్మ రక్షిత మాట్లాడుతూ బుద్ధ పౌర్ణమి ప్రాముఖ్యతను వివరించారు. మహామాయ సిద్ధార్థ గౌతమునకు వైశాక పౌర్ణమి రోజున జన్మనిచ్చిం దని తెలిపారు. జ్ఞానోదయుడైన బుద్ధుడు నాలుగు ఘన సత్యాలను కనుగొన్న గొప్ప దినమని అన్నారు. భగవాన్ బుద్ధుడు 80 ఏళ్ల వయ సు వరకు దమ్మ బోధన చేస్తు మహపరి నిర్వాణం పొందిన వైశాఖ పౌర్ణమి నాడేనని అన్నారు. ప్రపంచ బౌద్ధులకు అత్యంత పవిత్రమైన దినమని వివరించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ జడ్జ్ ఉదయ్‌భాస్కర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అల్జాపూర్ గోదావరిలో వ్యక్తి మృతదేహం లభ్యం

నవీపేట,మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచ పంచాయతీ పరిధిలోని అల్జాపూర్ శివారులోని గోదావరి నదిలో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్ఐ వినయ్ తెలిపారు. మృతుడికి సుమారు 45నుండి 50సంవత్సరాల మధ్యన వయసు ఉంటుందని అతడు మృతి చెంది సుమారు మూడు నుంచి నాలుగు రోజుల మధ్యన అయిఉంటుందని భావిస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి కాలికి వల చుట్టుకుని ఉందని అతడి ఒంటిపైన కేవలం డ్రాయర్ మాత్రమే ఉందని అన్నారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నర్సాపూర్‌లో సీసీ రోడ్డుపనులు ప్రారంభం

కమ్మర్‌పల్లి, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపూర్ గ్రామంలో సీసీరోడ్డ పనులను కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలెపు నర్సయ్య, టీపీసీసీ అధికార ప్రతినిధి బాసవేణుగోపాల్ యాదవ్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. తమ గ్రామానికిచెందిన యాదవ కాలనీలో నిధులు ఇపిప్పంచినందుకు మంత్రి సీతక్కకు గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

సాంగ్లీ వ్యవసాయ మార్కెట్ కమిటీ సందర్శన



ధాన్యాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

కోటగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని సాంగ్లీ వ్యవసాయ మార్కెట్ కమిటీని సోమవారం కోటగిరి మార్కెట్ కమిటీ పాలకవర్గం సందర్శించింది. ఏఎంసీ చైర్మన్ హన్మంతు ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, సిబ్బంది మార్కెట్ కమిటీ పనితీరుపై అధ్యయనం చేశారు. సాంగ్లీ మార్కెట్ కమిటీలో పసుపు, బెల్లం, చెరకు, మిర్చి, ద్రాక్ష ఇతర పంటల క్రయ, విక్రయాలను అధ్యయనం చేశారు. కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షులు అనిల్, విండో అధ్యక్షులు సిద్దు, డైరెక్టర్ జగన్నాథ్ రావు, సాయిలు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో నూతన తహసీల్దార్‌కు సన్మానం

వేల్పూర్, మే 12(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీకాంత్‌ను సోమవారం మండలంలోని రేషన్‌షాపు డీలర్లు, మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శాలువ, పుష్పగుచ్చంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు కాంతరావు, కార్యదర్శి భూమేశ్వర్, డీలర్లు బాస గంగాధర్, తాళ్ల రాజన్న, శేఖర్, మండల యూద్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రవికాంత్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యంచలో పుష్కర ఘాట్ నిర్మించాలని వినతి

నవీపేట,మే12(ఆంధ్రజ్యోతి): మండలంలోని యంచలో గోదావరి నది ఒడ్డున పుష్కర ఘాట్ నిర్మించాలని పలువురు గ్రామస్థులు సోమవారం అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో వారు ఈ వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో జిల్లాలోని గోదావరి నది ఒడ్డున ఉన్న చాలా గ్రామాలలో పుష్కర ఘాట్‌లను నిర్మించారని, ప్రధాన రహదారి పక్కన ఉన్న యంచలో పుష్కర ఘాట్ నిర్మించకపోవడంతో భక్తులు అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని వారు పేర్కొన్నారు.

● బ్రిడ్జికి ఇరువైపులా రక్షణ గోడ నిర్మించాలి

మండలంలోని యంచ గోదావరి నదిపై ఉన్న రోడ్డు బ్రిడ్జికి ఇరువైపులా ఆరు ఫీట్ల ఎత్తుతో రక్షణ గోడ నిర్మించాలని యంచ గ్రామస్థులు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ప్రజావాణిలో వారు కలెక్టర్‌ను కలిశారు. ప్రస్తుతం బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న బారికేడ్లు చాలా తక్కువ ఎత్తులో ఉండడంతో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కొందరు బ్రిడ్జిపై నుండి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్నారని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్, బాపు రావు, మోహన్, చందరి ప్రవీణ్, లక్ష్మీపతి తదితరులున్నారు.

మద్యానికి బానిసై యాసిడ్ తాగి వ్యక్తి ఆత్మహత్య

కామారెడ్డి టౌన్, మే 12(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఒకరు యాసిడ్‌తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సోమ వా రం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం కామారెడ్డి పట్ట ణం లోని వాంబే కాలనీకి చెందిన జోర్రిగల ఓంప్రకాష్(51) గుమాస్తాగా పనిచేస్తున్నాడు. ఇటీవల మద్యానికి బానిసై చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తి చెంది యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసు పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స నిమిత్తం నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఓంప్రకాష్ మృతిచెందినట్లు సీఐ తెలిపారు.

● ఉరివేసుకుని మహిళ..

కామారెడ్డి విద్యానగర్‌కు చెందిన మంగళి శ్రీవిద్య తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం శ్రీవిద్య భర్తతో విడిగా ఉంటూ తన సోదరి శ్రీమతితో కలిసి నివసిస్తుంది. గత కొంత కాలం గా చెడువ్యసనాలకు బానిసైందని, తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతురాలి సోదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి..

దోమకొండ : కడుపునొప్పి భరించలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఏఎస్సై జానీబాషా తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉసికే లక్ష్మణ్ (45) అనే వ్యక్తి గత కొన్ని సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతూ ఉన్నాడు. దీంతో ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి వెళ్లిపొయి దోమకొండ శివారులోని కుడి చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన తెలిపారు. మృతుని భార్య భవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

రెంజల్,మే12(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు అధికమవుతున్న తరుణంలో ప్రతి ఒక్కరు సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ చంద్రమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని సాటాపూర్ గ్రామంలో ప్రజలకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ చట్టాలపై అవగాహన కల్పించారు. పోలీసు సిబ్బందితో ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి గ్రామ చౌరస్తా వద్ద ప్రజలకు సైబర్ క్రైమ్, ట్రాఫిక్ చట్టాలపైన అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు చట్టాలు తెలుసుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందని, సోషల్ మీడియా యుగంలో సైబర్ క్రైమ్‌లు అధికమవుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ సైబర్‌క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఏదైనా తప్పుడు కాల్స్ వస్తే పోలీసులకు సమాచారం అందించాలని అలాగే పోలీసులను సంప్రదించాలన్నారు. ఆయన వెంట హెడ్ కానిస్టేబుళ్ల శంకర్, సునీత, కానిస్టేబుళ్ల శంకర్ రెడ్డి, ఒడ్డెన్న పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం(ఫైల్)

పచ్చి రొట్ట.. పంటకు రక్ష

● రసాయనాల వాడకం తగ్గించేందుకు ప్రత్యామ్నాయం

● రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు

కోటగిరి, మే 12 (ఆంధ్రజ్యోతి): అధిక దిగుబడులే లక్ష్యంగా పంటల సాగులో విచ్చల విడిగా రసాయన ఎరువుల వినియోగం హానికరమని వ్యవసాయ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వీటితో భూసారం దెబ్బతింటుందని వివరించే ప్రయత్నం చేస్తున్నారు. క్రమంగా పంటలు సూక్ష్మ, స్థూల పోషకాలు లోపిస్తాయని హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో భూసారం పెంచుకునేందుకు ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట సాగు చేసి పంటలను కాపాడుకోవాలని సూచించారు.

● సాగుకు ముందు

జీలుగ, జనుము, పెసర, పిల్లి పెసర వంటివి ప్రధాన పంటల సాగుకు ముందు పొలంలో పండించి తర్వాత కలియ దున్నడం ద్వారా మేలు జరుగుతుందని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. ఫలితంగా రసాయన ఎరువులు తగ్గడంతో పాటు వాటి కోసం అయ్యే ఖర్చు పంట నాణ్యత ఇలా ఎన్నో లాభాలు పొందవచ్చని వివరిస్తున్నారు.

● నత్రజని, భాస్వరం పుష్కలం

జీలుగ, జనుము, పెసర, పిల్లి పెసర సాగు మొగ్గ దశ వరకు పెంచాలి. ఆ తర్వాత భూమిలో కలియ దున్నాలి. సాధారణంగా ఇవి పూత దశకు రావడానికి 40నుంచి 50రోజుల సమయం పడుతుంది. ఇది లెగ్యూం జాతికి చెందినవి కావడంతో నత్రజని స్థాపనకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. వీటితో పంటకు అవసరమైన నత్రజని, భాస్వరం లభిస్తుంది. దీంతో రసాయన ఎరువులు, యూరియా, డీఏపీ వాడకం తగ్గుతుంది. సాధారణంగా మే, జూన్ నెలలో దుక్కిని దున్ని విత్తనాలను చల్లుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో వ్యవసాయ అధికారులు అందుకు తగిన సలహాలు, సూచనలు అందిస్తున్నారు. పచ్చిరొట్టతో ప్రయోజనం పొందాలని సూచిస్తున్నారు.

● ఉమ్మడి మండలానికి 140క్వింటాళ్ల జీలుగ

కోటగిరి, పొతంగల్ మండలాల్లో రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారి రాజు, నిశితలు తెలిపారు. కోటగిరి మండలంలోని కొత్తపల్లిలో 30క్వింటాలు, కోటగిరిలో 30క్వింటాలు, ఎత్తొండలో 15క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. పొతంగల్ మండలంలో సొసైటీ పరిధిలో 50క్వింటాళ్లు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఒక్క హెక్టారుకు ఒక బ్యాగు చొప్పున రైతులకు అందిస్తామన్నారు. సబ్సిడీ పోనూ బ్యాగు ధర 2160రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీ నుంచి జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారులు తెలిపారు.

● అధిక దిగుబడి: రాజు, వ్యవసాయ అధికారి, కోటగిరి



పచ్చిరొట్ట సాగుతో భూమి సారవంతంగా అవుతుంది. సాగు చేసిన పంటలకు సేంద్రీయ ఎరువులతో పాటు నత్రజని అందిస్తుంది. దీంతో పంటలు సంపూర్ణ ఆరోగ్యంగా ఎదిగి అధిక దిగుబడులు వస్తాయి. రసాయన ఎరువుల వాడకం, వాటి కోసం అయ్యే ఖర్చు తగ్గుతుంది.

వేంకటేశ్వర ఆలయంలో స్వామివారి పల్లకీ సేవ ఊరేగింపు



మెండోర ఆలయంలో పల్లకిలో ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

మెండోర, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి పల్లకీ సేవను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పౌర్ణమి రోజు పురస్కరించుకుని స్వామి ఉత్సవ మూర్తులను గోవింద నామాలతో ఆలయం చుట్టూ ఊరేగించారు. పల్లకి సేవముందు మహిళలు మంగళ హారతులతో భక్తులు ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదాన సత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ ప్రధాన అర్చకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఫోకస్



ఇందిరమ్మ కాలనీలో అధ్వానంగా మారిన రహదారులు ఇలా

15 ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోరా?

● ఇందల్వాయి మండలంలో అభివృద్ధికి నోచుకోని ఇందిరమ్మ కాలనీలు ● కనిపించని డ్రైనేజీలు, సీసీ రోడ్లు

ఇందల్వాయి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఇళ్లులేని నిరుపేదలకు ఉచితంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల కాలనీలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, తాగునీరు, విద్యుత్ దీపాలు లేక అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. ఏం చేయాలో తెలియక కాలనీవాసుల్లో గందరగోళం నెలకొంది. ఇందిరమ్మ ఇళ్లను కేటాయించి 15 ఏళ్లు గడిచినా పట్టింపు లేకుండా పోయింది. మండలంలోని నల్లవెల్లి, సిర్నాపల్లి తదితర గ్రామాలు ఇందిరమ్మ ఇళ్లను వైఎస్ఆర్ ప్రభు త్వంలో ఉన్నప్పుడు కేటాయించారు. ఇంటిస్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించారు. 15 ఏళ్లు గడుస్తున్నా మౌలిక వసతులు, డ్రైనేజీ, సీసీ రోడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీటి వసతి కల్పించడంలో అధికారులు విఫలం చెందారని ఇందిరమ్మ కాలనీ వాసులను అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. సిర్నాపల్లి, నల్లవెల్లి గ్రామాల్లోని పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నా ఇందిరమ్మ కాలనీలను మాత్రం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఓట్ల కోసం కాలనీలో ప్రతీ ఇళ్లకు తిరుగుతూ అభివృద్ధి చేస్తామని చెబుతూ తీరా ఎన్నికల్లో గెలిచాక మర్చిపోతున్నారని అన్నారు. ఇందిరమ్మ కాలనీ వాసులపై ఎందుకింత నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

సిర్నాపల్లిలో..

మండలంలోని సిర్నాపల్లి గ్రామంలో 2006లో అప్పటి ప్రభుత్వం 70 కు టుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇచ్చారు. 15 ఏళ్లు గడిచిన ఇప్పటి వరకు ఇంటి నెంబర్ కేటాయించలేదు. ఇంటి పన్నులు, ఇతర పన్నులు కట్టడానికి కాలనీవాసులు సిద్ధంగా ఉన్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

నల్లవెల్లిలో..

మండలంలోని నల్లవెల్లి గ్రామంలో దాదాపు 20 కుటుం బాలు ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నాయి. 15 ఏళ్లు పూర్తయినా సీసీ రోడ్లు, డ్రైనేజీ మాత్రం చేపట్టలేదు. ప్రతియేడాది ఇంటి పన్నులు కడుతున్నా అభివృద్ధి చే యడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా అధి కారులు స్పందించి ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాట్లు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

వర్షాకాలం అధ్వానం

వర్షాకాలం వచ్చిందంటే చాలు చిరుజల్లులకే రోడ్లన్నీ బురదమయంగా మారుతాయి. ఆ రోడ్ల వెంబడి పిల్లలు, వృద్ధులు నడవాలంటే భయమేస్తుంది. బురద రోడ్ల వెంబడి కాలుజారి పడి గాయాలపాలైన ు ఉన్నాయి.

తాగునీరు లేదు

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపడుతున్నా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాల్లో తాగునీరు అందిస్తున్నా గ్రామాల్లోని కొన్ని కాలనీలో నీరు అందక ఇబ్బందులు పడుతున్నారు.

అభివృద్ధి చేయలేదు

● రవిగౌడ్, నల్లవెల్లి



ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చారే తప్ప ఏమి అభివృద్ధి చేయలేదు. కాలనీలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేవు. వర్షాకాలం వస్తే నడవడానికి కష్టంగా ఉంది. అధికారులు స్పందించి సమస్య తీర్చాలి.

ఇంటి నెంబర్లు కేటాయించలేదు

● ఇంజమూరి నితిన్, సిర్నాపల్లి



15 ఏళ్లు గడిచిన ఇంటి నెంబర్లు లేవు. నెంబర్లు లేక ఇంటి పన్నులు కట్టలేకపోతున్నాం. దీంతో మా కాలనీలో అభివృద్ధి చేస్తలేరు. ఎన్నిసార్లు చెప్పిన అధికారుల స్పం దన లేదు. అధికారులు పట్టించుకోకపోతే ఎవరికి చెప్పాలి.

నిధులు వస్తే ఇందిరమ్మ కాలనీలను అభివృద్ధి చేస్తాం

● ఎంపీడీవో అనంత్‌రావు

సిర్నాపల్లి ఇందిరమ్మ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి రూరల్ ఎమ్మెల్యే స్పందించి 20లక్షలు మంజూరు చేశారు. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం. నల్లవెల్లి ఇందిరమ్మ కాలనీలో నిధులు వస్తే కాలనీ అభివృద్ధికి సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం చేపడుతాం.


ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు

● ఇబ్బందుల్లో వేల్పూర్ మండల ప్రజలు ● పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన



వేల్పూర్‌లో ప్రధాన రోడ్డు నుంచిఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం



మోతె వీధి రోడ్డు మధ్యలో ..



వేల్పూర్‌లో ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభం

వేల్పూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. అంతేకాకుండా పలు గ్రామాల్లో నివాసపు ఇళ్లపై నుంచి అతితక్కువ ఎత్తు నుంచి విద్యుత్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న దృశ్యాలు చాలా ఉన్నాయి. అలాగే గ్రామాలలోని వీధులలో అడ్డగోలుగా ఏర్పాటు చేసిన వీధి లైట్ల స్తంబాల వల్ల ప్రజలకు ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్ల మూలమలుపుల వద్ద, రోడ్ల మధ్యలో విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేశారు. వాటి వల్ల గ్రామంలోని రోడ్లపై వాహనాలు వెళ్లలంటే ఇబ్బందిగా ఉందని వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లమధ్యలో ఉన్న స్తంభాలను గమణించకుండా వెళ్తున్న వాహనదారులు పలు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లోని కొత్త ప్లాట్‌లు, కాలనీ వీధుల్లో చాలాచోట్ల ఇప్పటికి విద్యుత్ స్తంబాలు ఏర్పాటు చేయకపోవడంతో గత్యంతరం లేక కర్రలనే విద్యుత్ స్తంబాలుగా ఏర్పాటు చేసుకొని కాలం వెల్లదీస్తున్నారు. ఈ విషయాలను పలుమార్లు ప్రజాప్రతినిధులకు, ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించిన ఫలితం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కొన్ని గ్రామాల్లో చాలా ఏండ్లక్రితం వేసిన విద్యుత్ స్తంబాలు వంగిపోయినవి, తుప్పుపట్టినవి దర్శనమిస్తున్నాయి. ఇలాంటి ప్రమాదకరమైన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న విద్యుత్ వైర్లు కన్పించినప్పటికి తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నా ట్రాన్స్‌కో అధికారులపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగితేనే స్పందింస్తారా అంటూ ట్రాన్స్‌కో అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను తొలగించి వేలాడుతున్న వైర్లను సరిచేసి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరమైన స్తంభాలను తొలగించాలి

● మొండి అశోక్, వేల్పూర్



గ్రామాల్లో వీధి రోడ్ల మధ్య ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంబాలను తొలగించి సురక్షిత ప్రాం తంలో కొత్తగా స్తంభాలను ఏర్పాటు చేయాలి. గ్రామాల్లోని వీధుల్లో నిత్యం ప్రజల సందడి ఉంటుంది. ఎలాంటి ప్రమాదాలు జరుగకముందే ట్రాన్స్‌కో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టవల్సిన అవసరం ఎంతైనా ఉంది.



శివాలయంలో పూజలు చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్

సిద్దుల గుట్టపై ఘనంగా పల్లకీ సేవ

పెర్కిట్, మే 12(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం భక్తి శ్రద్దలతో పల్లకి సేవ నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు సిద్దుల గుట్టపైకి విచ్చేసి శివాల యంలో పంచామృతంతో, బిల్వపత్రాలతో అభిషేకం నిర్వహించి రామాల యం, దత్తాత్రేయ మందిరం, దుర్గమాత ఆలయాలలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. టీపీసీసీ అధికారి ప్రతినిధి ఏబీ శ్రీని వాస్(చిన్న) శివాలయంలో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నందీశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ కమిటి వారు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బి. సుమన్, పీసీ గంగారెడ్డి, కొడిగెల మల్లయ్య, చరణ్‌రెడ్డి, జిమ్మి రవి, సంధ్య, బట్టు శంకర్, ప్రశాంత్‌గౌడ్, కొంతం మంజూల మురళి, హజారి సంతోష్, అలిశెట్టి నరేష్, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంక్సాపూర్ దత్తాశ్రమంలో ఘనంగా దత్త మహాయాగం

వేల్పూర్, మే 12(ఆంధ్రజ్యోతి): అంక్సాపూర్ గ్రామంలోని దత్తాశ్రమంలో పాదరస లింగేశ్వర ఆలయంలో సోమవారం భక్తిశ్రద్దలతో దత్తామహాయాగం ఘనంగా నిర్వహించారు. ఉదయం భక్తులు బాజ భజంత్రీల మధ్య ఘటాలతో గ్రామంలోని గ్రామ దేవతల ఆలయాల వరకు ఊరేగింపుగా వెళ్లారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హనుమాన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పాదరస లింగం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దత్తామహాయాగం కార్యక్ర మాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.





దత్త మహాయాగం నిర్వహిస్తున్న భక్తులు, ఘటాలతో ఊరేగింపు

కమనీయం.. లక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



స్వామివారి మూల విరాట్



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ చైర్మన్, ఈవో



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



భిక్కనూరు సిద్దరామేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పాల్గొన్న భక్తులు

మాచారెడ్డి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీ నర్సింహస్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా కన్నుల పండువగా వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ఘనంగా జరిపించారు. స్వామి వారికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఆలయ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు సమర్పించారు. చైర్మన్ దంపతుల చేతుల మీదుగా స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని తిలకించడానికి వేలాదిమంది భక్తులు తరలివచ్చి కల్యాణ మహోత్సవంతో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా కల్యాణం సందర్భంగా చాలామంది పుస్తె మెట్టెలతో పాటు ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చైర్మన్, ఈవో ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమి టీల చైర్మన్‌లు, వివిధ పార్టీల నాయకులు, వేదపండి తులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

సిద్ధరామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

భిక్కనూరు: భిక్కనూరు మండలకేంద్రంలోని దక్షిణ కాశీగా బాసిల్లుతున్న సిద్ధరామేశ్వర ఆలయంలో సోమవారం స్వామివారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా స్వావివారిని ఆలయ అర్చకులు తీరొక్క పూలతో ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాల వితరణ చేశారు. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించు కుని మొక్కులు తీర్చుకున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాంధారి,మే 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి చెక్కులను అందించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఎవరికి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు చెక్కులను లబ్ధిదారులకు అందించాలని సూచించారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ ఆకుల లక్ష్మన్, మాజీ ఎంపీటీసీలు తూర్పురాజులు, బాలయ్యబాబా, లైన్‌రమేష్, ఈశ్వర్‌గౌడ్, నీలరవి,షైమద్, బాలు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గానికి సంబంధించిన పలు గ్రామాలలో సోమవారం కాంగ్రెస్ నాయకులు 25 సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆపదసమయంలో నేనున్నానని ప్రతిఒక్కరికీ అందుబాటులో ఉంటూ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. రోడ్డుప్రమాదాల్లో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా చూస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల యూత్ ప్రెసిడెంట్ సల్మాన్, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ప్రతీ ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలి'



బాలసంస్కార శిబిరంలో తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న దృశ్యం

సదాశివనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : ప్రతివ్యక్తి తల్లి, తండ్రి, గురువు, దైవంతో పాటుగా దేశభక్తిని కూడా కలిగి ఉండాలని మహంతి శ్రీ మచాలే బాబా అన్నారు. వారం రోజుల పాటు నిర్వహించిన బాలసంస్కార్ శిబిరం ముగింపు సమావేశాలను మండలంలోని లింగంపల్లి శ్రీ కృష్ణమందిరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు దూరమవుతున్న ఈ సమయంలో హిందు సంప్రదాయాలు, భక్తి, సంస్కృతి అలవాట్లను చిన్నారుల్లో ఆ వయస్సులోనే ఇనుమడింపచేయాలని ఈ బాలసంస్కార్ శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఆహారపు అలవాట్ల దినచర్యతో పాటుగా ఆత్మరక్షణ కోసం విన్యాసాలు, భగవద్గీత పఠనం, తల్లిదండ్రులపై గౌరవం ఎలా ఉండాలనేది వారం రోజులు ప్రతివిద్యార్థికి నేర్పించామన్నారు. కార్యక్రమంలో సాందీపని విద్యాసంస్థల చైర్మన్ బాలాజీరావు, వాఖ్యాత మనోహర్‌రావు, ఎస్‌ఆర్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దత్తాద్రి, భూంరావు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠ మహోత్సవం



భైరాపూర్ విఠలేశ్వర ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

బీర్కూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భైరాపూర్ గ్రామంలో రుక్మిణి విఠలేశ్వర ఆలయం మహా పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. స్వామి వారిని దర్శించుకునేందుకు ఎక్కడెక్కడి నుంచో భక్తులు వస్తుంటారు. ఇది లా ఉండగా కొన్నిరోజుల క్రితం ఆలయ ధ్వజం నేలకొరిగింది. అయితే ఆలయ కమిటీ సభ్యులు ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠించేందుకు సోమవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఆలయ సన్నిధిలో గణపతి పూజలు, నవగ్రహ పూజలు, యాగశాల ప్రవేశపూజలు, సుదర్శన హోమం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే ఆలయ సన్నిధిలో అఖండ హరి నామ సప్తాహ కార్యక్రమం ప్రారంభం అయింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాముకాటుకు గురై వ్యక్తి మృతి



బెస్తఅశోక్ మృతదేహం

నాగిరెడ్డిపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చయపల్లి గ్రామానికి చెందిన బెస్తఅశోక్ (47) పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చయపల్లి గ్రామానికి చెందిన బెస్త అశోక్‌చేపలు పట్టడానికి ఆదివారం గ్రామ శివారులోని ఊర చెరువులోకి వెళ్లి చెరువులో చేపల కోసం వల వేసి చెరువు గట్టుమీద పడుకుని ఉండగా పాము అతన్ని కాటు వేసిందన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్సకి జరిపి, మెరుగైన చికిత్స కోసం అతన్ని ఎల్లారెడ్డి నుంచి కామారెడ్డి ఆసుపత్రికి అతడిని తరలించగా సోమవారం ఉదయం అశోక్ మృతిచెందినట్లు తెలిపారు. చేపల వేటకు వెళ్లి గుర్తు తెలియని పాము కాటు వేయడంతో తన భర్త అశోక్ మృతి చెందినట్లు మృతుడి భార్య బెస్త భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

భిక్కనూరు, మే 12: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాచాపూర్ గ్రామంలో వివాహానికి హాజరైన యువకుడు అనుమానాస్పదంగా మరణించినట్లు ఎస్సై ఆంజనేయలు సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం దోమకొండ మండలంలోని సంగమేశ్వర్ గ్రామానికి చెందిన గరిగంటి నరేష్(33) అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురితో కలిసి మద్యం సేవించి మండలంలోని కాచాపూర్ ఎల్లమ్మ ఆలయంలో జరిగిన వివాహంలో పాల్గొని భోజనం చేస్తుండగా ఒక్కసారిగా కిం దపడిపోయాడు. స్నేహితులు వెంటనే కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తర లించగా అక్కడ అతడిని పరిక్షించిన వైద్యులు మృతిచెందినట్లు తెలిపారు. ఈ మేరకు మృతుడి బంధువుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి తరలిస్తున్న నిందితులు!

రామారెడ్డి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారం, బట్టు తండా, గోకుల్‌తండాలో కొందరు యువకులు గంజాయి తరలిస్తుండగా కామారెడ్డి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కామారెడ్డి ఎస్పీ, ఏఎస్పీ చైతన్యరెడ్డి నేతృత్వంలో గంజాయి నిందితులను పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ విషయమై రామారెడ్డి ప్రొబెషనరీ ఎస్సై నవీన్ చంద్రను సోమవారం వివరణ కోరగా కామారెడ్డి పోలీసుల అదుపులో ఉన్న విషయం తమకు తెలియలేదన్నారు.

తాగునీటి కోసం రోడ్డుపై బైఠాయించి మహిళల నిరసన



ఖాళీ బిందెలతో రాస్తారోకో చేస్తున్న మహిళలు

బాన్సువాడ, మే 12 (ఆంధ్రజ్యోతి): తాగునీటి కోసం మహిళలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బాన్సువాడ మండలంలోని కొత్తబాది గ్రామంలో సోమవారం నీటి కష్టాలు తీర్చాలంటూ మహిళలు రాస్తారోకో నిర్వహించారు. గత కొంతకాలంగా మంచినీటి సరఫరా కావడం లేదని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సమస్య పరిష్కరించే వరకు రాస్తారోకో విరమించేది లేదని భీష్మించుకుకూర్చున్నారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని సముదా యించారు. రోడ్డుపనులు జరుగుతున్న తరుణంలో బోరుమోటర్లను ఇతర ప్రాంతాలకు తరలించి తాగునీటి కోసం పైపులైన్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో గ్రామంలో తాగునీటి సమస్య ఎదురయిందని మహిళలు పేర్కొన్నారు. గ్రామస్థాయి అధికారులకు వెంటనే తాగునీటి సదుపాయం కల్పించాలని కోరినప్పటికీ పట్టించు కోవడంలేదని, వెంటనే తాగునీటి సమస్య పరిష్క రించాలని మహిళలు డిమాండ్ చేశారు. ఒక్క రోజులోనే నీటి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

రథోత్సవం సందర్భంగా క్రికెట్ పోటీలు



క్రికెట్ జట్లతో నిర్వాహకులు

మద్నూర్, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో లక్ష్మీనారాయణ మందిరం ఆధ్వర్యంలో రథోత్సవాన్ని పురస్కరించుకొని యువకులకు ఎంపీయల్ 2025 క్రికెట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో మండల కేంద్రానికి చెందిన గోశాల టీం మొదటి బహుమతి గెల్చుకోగా, ద్వితీయ బహుమతి నవయుగ గణేష్ మండల్ వారు గెలుచుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ప్రతి సంవత్సరం బుద్ధపూర్ణిమ సందర్భముగా రథోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఎంపీఎల్ క్రికెట్ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. అలాగే మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ గోశాలలో కుస్తీ పోటీలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన యోధులకు రూ.500 నుంచి 5000 వేల వరకు నగదు బహుమతులు అందజేయనున్నారు.

● అన్నదాన ప్రసాద వితరణ

మండల కేంద్రంలో సోమవారం నుంచి లక్ష్మీ నారాయణ మందిరం ఆధ్వర్యంలో రథోత్సవ కార్యక్రమాలు ప్రారం భం కాగా రథోత్సవానికి వచ్చిన భక్తుల కోసం అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం జుక్కల్ శాస నసభ్యులు తోట లక్ష్మీకాంతరావు తరపున భక్తు లకు అన్నదాన వితరణ చేయగా, మంగళవారం జహీరాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్ తరపున అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం చేయనున్నట్లు ఆలయనిర్వాహకులు తెలిపారు. రథోత్సవ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని కోరారు.

వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు



వాహనదారులను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ నవీన్ చంద్ర

రామారెడ్డి, మే 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గొల్లపల్లి గ్రామస్టేజీ వద్ద సోమవారం సాయంత్రం పోలీసులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రొబేషనరి ఎస్సై నవీన్ చంద్ర నేతృత్వంలో వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్స్‌లు, హెల్మెట్‌లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఒకే మోటార్ సైకిల్‌పై ముగ్గురు, మద్యం తాగుతూ, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో ఏఎస్సై రవీందర్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం



ఎంపీ ఈటెలకు ఆహ్వానం అందజేస్తున్న ముదిరాజ్‌లు

లింగంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పర్మల్లలో నూ తనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయం ప్రారంభోత్సవానికి రావాలని కోరుతూ గ్రామ ముదిరాజ్‌లు సోమవారం హైదరాబాద్‌లో ఎంపీ ఈటెలరాజేందర్‌కు ఆహ్వానం అందజేశారు. ఆలయ నిర్మాణానికి దేవా దాయ శాఖ ద్వారా రూ.40లక్షలు సహకారం అందించారని వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనతో పాటు శాసన మండలి డిప్యూటీచైర్మన్ బండప్రకాశ్‌కు, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌కు నీలం మధు కు ఆహ్వానం అందజేశారు. ఈనెల 19నుంచి 22వరకు జరిగే పెద్దమ్మ దేవత విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాలని వారు కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విఠల్ పర్మల్ల గ్రామానికి చెందిన చంద్రబాబు, సాయికుమార్, ఈర్ల శ్రీనివాస్, బాలయ్య, అంజయ్య, జగతిశ్రీనులతో పాటు ముదిరాజ్‌లు ఉన్నారు.

ముగిసిన దుర్గమ్మ ఉత్సవాలు

● ఐలాపూర్‌లో రసవత్తరంగా కుస్తీపోటీలు



ఐలాపూర్‌లో కుస్తీపడుతున్న మల్లయోధులు

లింగంపేట, మే 12 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట మండలంలోని ఐలాపూర్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న దుర్గమ్మ ఉత్సవాలు సోమవారం కుస్తీపోటీలతో ముగిశాయి. శుక్రవారం ఎడ్ల బండ్ల ప్రదర్శనతో ప్రారంభమైన ఉత్సవాలు సోమవారం కుస్తీ పోటీలతో ముగిశాయి. ఎంతో చారిత్రక మహిమలు గల అమ్మవారిని దర్శించుకునేందుకు మండలంలోని రాంపల్లి, కన్నాపూర్, పొల్కంపేట, శెట్పల్లి, పర్మల్ల, సురాయిపల్లి గ్రామాలతో పాటు ఎల్లారెడ్డి, తాడ్వాయి, మండలాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కుస్తీపోటీలలో పాల్గొనేందుకు జిల్లాలోని వివిధ మండలాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి మల్లయోధులు తరలివచ్చారు.

కిష్టాపూర్‌లో ఘనంగా రథోత్సవం

బీర్కూర్, మే 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో పౌర్ణమి సందర్భంగా సోమవారం రథోత్సవం నిర్వ హించారు. స్థానిక హనుమాన్ ఆలయం నుంచి ప్రధాన రహదారి వరకు రథోత్సవం నిర్వహించారు. ఇదిలా ఉండగా హనుమాన్ ఆలయం సమీపంలో అగ్ని గుండం ఏర్పాటు చేశారు. భక్తులు అగ్నిగుండంలో నడి చి తమ భక్తిని చాటుకున్నారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలో జాతర జరిగింది. కుస్తీపోటీలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కుస్తీ పోటీలు

బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామంలో సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. గ్రామంలో ప్రతీఏటా పౌర్ణమి సందర్భంగా రథోత్సవం, అగ్నిగుండం, కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మల్ల యోధులు తలబడ్డారు. గెలుపొందిన వారికి గ్రామ పెద్దలు నగదు బహుమతులు అందజేశారు. కుస్తీ పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి!

(5వ పేజీ తరువాయి)

చేస్తున్నారు. ప్రభుత్వం ఇండ్ల నిర్మాణానికి విడుతల వారిగా రూ.5లక్షల నిధులను విడుదలచేయనుంది. మొదటి విడుత కింద బెస్మిట్ లెవల్‌లో రూ.1లక్ష, రెండో విడుత కింద గోడల నిర్మాణం చేపట్టిన తర్వాత రూ.1లక్ష, మూడో విడుతలో స్లాబ్ పూర్తయ్యాక రూ.2 లక్షలు, నాలుగోవిడుతలో ప్లాస్టరింగ్,రంగులకు రూ.1లక్ష ప్రభుత్వం ఇవ్వనుంది. అయితే మొదట బెస్మిట్ లెవల్‌లో ఇండ్ల నిర్మాణం చేపట్టాలంటే సుమారు లక్షకు పైగానే ఖర్చు అవుతుంది. అయితే ఇంత పెద్దమొత్తంలో డబ్బులు లబ్ధిదారులకు సమకురకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇండ్ల నిర్మాణానికి ఎంపికైనప్పటికి నిధులు లేక నిర్మాణాలు ప్రారంభించలేకపోతున్నారు. ఇలా లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

లక్ష వరకు రుణసౌకర్యం

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎంపికైన లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందుల వల్ల నిర్మాణాలు ప్రారంభించకపోవడంతో పథకం ముందుకు సాగడం లేదని తెలుస్తుంది. ప్రభుత్వం విడుతల వారిగా నిధులు మంజూరుచేస్తామన్న విషయం తెలిసిందే. అయితే లక్ష రూపాయలు కూడా లేకుండా ఇండ్ల నిర్మాణం చేపట్టలేమని లబ్ధిదారులు చెబుతున్నారు.ఈ నేపథ్యంలో పేదలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇండ్ల నిర్మాణానికి రుణసౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. నిర్మాణానికి డబ్బులు లేకుంటే ఆయా గ్రామాలలోని పొదుపు సంఘాలోంచి రూ.1లక్ష వరకు రుణం తీసుకునే సదుపాయం కల్పించింది. దీంతో లబ్ధిదారులకు కాస్త ఊరట లభించడమేకాకుండా ఇండ్ల నిర్మాణాల్లోను వేగం పెరిగే అవకాశం ఉంది.

ఎల్లారెడ్డిలో ఘనంగా అంతర్జాతీయ నర్సింగ్ డే



ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్‌కట్ చేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, మే 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వఆస్పత్రిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆసుపత్రి సిబ్బందితో కలిసి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నర్సులకు సన్మానం చేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీమున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ నర్సింగ్ సేవా ఆరోగ్య రక్షణలో ముందుండే వారని అన్నారు. ఆయనతో పాటు ఆసుపత్రి సూపరిండెంట్ డా.రవీంద్ర మోహన్, వైద్యులు, నర్సులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సికిందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం పనులకు నిధుల మంజూరుపై హర్షం



ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

సదాశివనగర్, మే 12 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులకు రూ.23 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేయడంపై సదాశివనగర్ మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలోని నంది విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు చిత్రపటాలకు కాంగ్రెస్‌నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సీడీసీ చైర్మన్ ఇర్షాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా కాళేశ్వరం పనులు ఎక్కడిక్కడే నిలిచిపోవడం జరిగిందన్నారు. ఈ విషయం గమనించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావన తీసుకువచ్చి ఈ ప్రాంత రైతుల మేలు కోసం నిలిచిపోయిన పనులకు రూ.23 కోట్లను మంజూరు చేయించడం హర్షణీయమన్నారు. సత్వరమే నిధుల విడుదలతో పనులు నిర్వహించి కాళేశ్వరం పనులను పూర్తిచేయించి ఈ ప్రాంత, రైతుల, ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిఉంటారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ గాదారి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ కరెట్లపల్లి దత్తురావు, నాయకులు భూంరెడ్డి, రూపేందర్‌రెడ్డి, రాజేందర్, నవీన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

మాచారెడ్డిలో కుట్టుమిషన్ల పంపిణీ



మాచారెడ్డిలో కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

మాచారెడ్డి, మే 12:(ఆంధ్రజ్యోతి) మాచారెడ్డి గ్రామ మహిళలకు గ్రామ స్వరాజ్యం సంస్థ ఆధ్వర్యంలో సోమవారం కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ రంగ వెంకటలక్ష్మీ మాట్లాడుతూ గ్రామమహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లను అందజేస్తామన్నారు. కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసినవారికి సర్టిఫికెట్లను ఇస్తున్నామని, మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఈ సంస్థ పనిచేస్తుందన్నారు. ఈ సంస్థద్వారా శిక్షణ పొందిన మహిళలు రూ.6500 చెల్లిస్తే రూ.18వేల విలువ చేసే మిషన్‌ను అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీవో సాయిబాబా, పంచాయతీ కార్యదర్శి ఆస్మాబేగం, మండల కోఆర్డినేటర్ విజయలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

'సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం హర్షణీయం'



సీసీటీవీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ

కామారెడ్డిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్ నగర్ డబుల్ బెడ్‌రూం సముదాయంలో ఏర్పాటుచేసిన సీసీటీవీ కెమెరాలను ఏఎస్పీ చైతన్యరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దిగువ, మధ్యతరగతికి చెందిన ప్రజలు ముందుకు వచ్చి ఇంటికి కొంత డబ్బు జమచేసుకుని రూ.2లక్షలతో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం అందరికి ఆదర్శప్రాయమని తెలిపారు. నేరపరిశోధనలో, నేరాలను అరికట్టడంలో, నేరస్తులను పట్టుకోవడంలో కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. మిగిలిన కాలనీలలో నివసించే ప్రజలు కూడా స్వచ్ఛందగా ముందుకు వచ్చి కెమెరాలను ఏర్పాటుచేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీరాం, సిబ్బంది కమలాకర్‌రెడ్డి, విశ్వనాథ్, అజర్, సంపత్, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మితిమీరుతున్న మొరం మాఫియా ఆగడాలు!

(5వ పేజీ తరువాయి)

మొరం అక్రమ తవ్వకాలను నియంత్రించాలని స్థానికులు పేర్కొన్నారు.

● మరో మాఫియాతో అధికారుల కుమ్మక్కు...

రాత్రి వేళలో జరుగుతున్న అక్రమ మురం తవ్వకాలు రవాణాకు రెవిన్యూ పోలీస్ శాఖలో కొంతమంది అధికారులు కుమ్మక్కు అయినట్లు పలు ఆరోపణలు ఉన్నాయి. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు పోలీస్ శాఖ పనిలో ఎదుట నుంచే అక్రమ మొరం రవాణా సాగుతున్న పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు సైతం పట్టించుకోకపోవడంపై పలు విమర్శలు ఉన్నాయి. ఇంత అక్రమ రవాణా జరుగుతున్న అటు రెవెన్యూ ఇటు పోలీస్ శాఖ నియంత్రించడంలో పూర్తిగా విఫలమైందని పలువురు పేర్కొంటున్నారు. అంతేకాకుండా కొంతమంది అధికారుల ప్రమేయం ఉండడంతోనే రాత్రి వేళలో అక్రమ రవాణా సాగుతుందని పలు విమర్శలు కూడా తావు ఇస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ప్రత్యేక బృందంతో తనిఖీలు చేపట్టి అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి'

కామారెడ్డిటౌన్, మే 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీలనాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహం వద్ద ఆయన మాట్లాడుతూ డిగ్రిసెమిస్టర్ పరీక్షలు అకాడమిక్ క్యాలెండర్‌కు అనుగుణంగా జర గకపోవడంతో విద్యార్థులంతా అయోమయంలో ఉన్నారని తెలిపారు. గతనెల 16న ప్రారంభం కావాల్సిన 2,4,6 సెమిస్టర్ పరీక్షలని ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించలేమని టీయూ వైస్‌చాన్సలర్‌కు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కాకపోవడం వల్ల కళాశాలలు నడపలేని స్థితిలో ఉన్నామని అన్నారు.

ఉచిత హెల్త్‌క్యాంపు విజయవంతం



దోమకొండలో ఉచితక్యాంపు నిర్వహిస్తున్న దృశ్యం

దోమకొండ,మే 12(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం శివబాలాజీ సిండికేట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ మల్లారెడ్డి నారాయణ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది ఉచితహెల్త్ క్యాంపు నిర్వహించారు. బీపీ, షుగర్, మోకాళ్లనొప్పులు, నడుము, దగ్గు, జ్వరం వివిధ రోగాలకు సంబంధించి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించి మందులు అందజేశారు. 600 మంది క్యాంపులో పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో అనంత్‌రెడ్డి, తాటిపల్లి శ్రీకాంత్, తీగల తిర్మల్‌గౌడ్, శంకర్‌రెడ్డి, నల్లపు శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, షమ్మీ, నయీం పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - శుభం
ప్రియా 70 - జగదేక వీరుడు అతిలోక సుందరి
ప్రియా 35 - సింగిల్

బాన్సువాడ

మహేశ్వరి - హిట్ 3
వెంకటేశ్వర - సీఎం పెళ్లాం

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	140	170
వెన్‌కాబ్(కిలో)	130	160	190

